క్లుప్తంగా

పాఠశాలకు వితరణ



పాఠశాలకు వస్తువులు అందజేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక గాంధీపురం–2లోని సుంకర భాస్కర రావు నగర పాలక ఉన్నత పాఠశాలకు శనివారం పలు వస్తువులు అందజేశారు. ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాల నాగు బలేష్ గుప్తా, ఉపాధ్యక్షులు యియ్యపు మురళీధర్, మద్దుల మురళీకృష్ణ చేతుల మీదుగా సుమారు రూ.50 వేలు విలువైన పది టేబుళ్లు, పది కుర్చీలు వితరణ చేశారు.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు కక్షపూరితం



హమీద్ బాషా

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా అరెస్టు చేసిందని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎండీ హమీద్ బాషా అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా, హామీల అమలుకై ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై ఇలా కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు తప్పదన్నారు.

3న యోగాసన పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా స్థాయిలో ఆదివారం జరగాల్సిన యోగాసన పోటీలు ఆగస్టు 3వ తేదీకి వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు కేఎస్‌వీ శ్రీధర్ రెడ్డి శనివారం తెలిపారు. పోటీలకు స్టేట్ అబ్జర్వర్ అందుబాటులో లేని కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

రోల్‌బాల్‌లో క్రీడాకారుల సత్తా



రోల్‌బాల్‌లో కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రకాశం నగర్: కాకినాడలో ఇటీవల జరిగిన 7వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోల్‌బాల్ చాంపియన్‌ షిప్ పోటీల్లో జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ జట్టు అండర్–14 బాలికల విభాగంలో, 17 ప్లస్ పురుషుల విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. ఈ విషయాన్ని అసోసియేషన్ కార్యదర్శి జి.అప్పారావు శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా జట్టులోని ధరహాస్, ప్రభాత్, వెనవీర్, రాయుడు, తరుణ్, రిషిక్, జితేంద్ర, విష్ణు, రిత్విక్, కల్యాణ్, సిద్ధు, కేశవ్, అశోక్‌లు ఆగస్టులో తమిళనాడులో జరిగే సౌత్ ఇండియా రోల్ బాల్ అసోసియేషన్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్ అశోక్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు రుద్రశ్రీ మహస్వీ తదితరులు అభినందించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్ఆర్ పృథ్వీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పృథ్వీ వెంకటరాజు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత ఎస్ఆర్ పృథ్వీ నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. ఆ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి పరీక్షల్లో రైసింగ్ స్టార్ అవార్డు సాధించిన కనితి కిశోర్, పోలాకి వాసవి, బొబ్బాడి మానిష వీటిని ఆయన, ప్రధానోపాధ్యాయుడు ప్రదానం చేశారు.

విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు 220 కేవీ సబ్ స్టేషన్‌లో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 160 ఎంవీఏకు పెంచే క్రమంలో సోమవారం నుంచి సెప్టెంబర్ 11 వరకూ అప్పుడప్పుడూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ జిల్లా సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, అనపర్తి, బిక్కవోలు, కోరుకొండ, గోకవరం, రంగంపేట, సీతానగరం మండలాలకు ఇలా అంతరాయం కలుగుతుందన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని సత్తి గంగిరెడ్డి తన తండ్రి వీర్రాఘవరెడ్డి జయంతిని పురస్కరించుకుని మహిళలకు చీరలు, పురుషులకు దుస్తులు అందించారు. అలాగే భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోని కొవ్వూరి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన వనం

- తుప్పలతో నిండిపోయిన ఇరిగేషన్ పార్కు
- పట్టించుకోని అధికారులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద ఉన్న కాటన్ విగ్రహం నుంచి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వరకూ ఉన్న ఉద్యానవనం అధ్వానంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. చూసేవాళ్లకు అది అసలు పార్కు మాదిరిగా కనిపించదు. ఏదో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలని భావిస్తారు. సాక్షాత్తూ ఇరిగేషన్ ఉన్నతాధికారుల కార్యాలయాలకు ఎదురుగా ఉన్న ఇరిగేషన్ పార్కు దుస్థితి ఇది.

నిర్వహణ లేక..

ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద ఉన్న కాటన్ విగ్రహం నుంచి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వరకూ పార్కు ఉంది. గతంలో ఈ పార్కులో స్థానికులు, ఇరిగేషన్ ఉద్యోగులు ఉదయం సమయంలో వాకింగ్ సైతం చేసేవారు. ఈ పార్కులోనే మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఘంటసాల విగ్రహాలు సైతం ఉన్నాయి. కాటన్ బ్యారేజీ, కాటన్ మ్యూజియం సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ పార్కు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చేది. కానీ నేడు నిర్వహణ లేకపోవడంతో చిట్టడవిని తలపిస్తున్నాయి. సేద తీరేందుకు అటు ఉంచితే లోపల సంచరించేందుకే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అభివృద్ధి చేయాలి

పార్కులో ఏర్పాటు చేసిన ఫిరంగి నమూనా, ఫౌంటైన్ చుట్టూ కూడా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వేలాది మంది ఇరిగేషన్ ఉద్యోగులకు సంబంధించి ఉన్న ప్రధాన ఉన్నతాధికారుల కార్యాలయాలు ఈ పార్కు ఎదురుగానే ఉన్నప్పటికీ వారు కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ పార్కులపై కనీస శ్రద్ధ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. పార్కును అభివృద్ధి చేస్తే ఉదయం సమయంలో మహిళలకు ఇది వాకింగ్ ట్రాక్‌గా ఉపయోగపడుతుందన్నారు. ఖాళీ సమయాల్లో ఇరిగేషన్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సేద తీరేందుకు ఈ పార్కు దోహదపడుతుందన్నారు. గోదావరి అందాలు తిలకించేందుకు వచ్చే సందర్శకులకు సైతం ఈ పార్కులో సేద తీరే విధంగా పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ధవళేశ్వరంలోని ఇరిగేషన్ పార్కులో ఫౌంటైన్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు



పిచ్చి మొక్కల మధ్యలో ఫిరంగి నమూనా



పార్కులోని మహనీయుల విగ్రహాలు

మాజీ మంత్రి వేణుకు సత్కారం



మాజీ మంత్రి వేణును సత్కరిస్తున్న దాసరి శివకుమార్

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. ఇటీవల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దాసరి శివకుమార్ శనివారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుబ్బారావు, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు విజయసారథి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, సుందరపల్లి ప్రేమ్ కుమార్, ఇబ్రహీం పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న కళాశాల సిబ్బంది

సీటీఆర్ఐ: ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాబ్ మేళాలలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం అన్నారు. సెంటర్ ఫర్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్, ఆర్జీ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు జాబ్‌మేళా నిర్వహించారు. ఆర్జీ టెక్ కంపెనీ ప్రతినిధులు పోలుబోతు రమాకాంత్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు వీటికి హాజరయ్యారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు, జి.శరత్ బాబు, డి.మధులత పాల్గొన్నారు.

జీతాల కోసం ఉపాధ్యాయుల నిరసన



డీఈవో కార్యాలయ ఏడీ వెంకట్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: బదిలీ అయ్యి రెండు నెలలు కావస్తున్నా ఇంకా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరం డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ కొత్త ప్రాంతాలకు బదిలీ అయిన పాత ఉపాధ్యాయుల జీతాలకు క్యాబినెట్ ఆమోదం కావాలని తాత్సారం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్ మాట్లాడుతూ పి.ఫోర్ కార్యక్రమం అంటూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు అప్పగించడం సమంజసం కాదన్నారు. అనవసర యాప్‌లతో ఇప్పటికే బోధనా కార్యక్రమాలు సన్నగిల్లుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలిస్తూ రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. ఆందోళనలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ గౌరీ, కోశాధికారి యూఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రమేష్ దయానిధి, ఎం.శ్రీనివాస్, ప్రకాశరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయ ఏడీ వెంకట్రాజుకు వినతిపత్రం సమర్పించారు.

స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

- కలెక్టర్ ప్రశాంతి
- కార్మికులు, అధికారులకు సత్కారం



కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: 2024–25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో రాజమహేంద్రవరానికి గుర్తింపు రావడం సంతోషకరమని, దీనికి కారణమైన పారిశుధ్య కార్మికులు అభినందనీయులని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి అన్నారు. నగరానికి ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్ అవార్డు రావడంతో శనివారం స్థానిక వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో కార్మికులు, అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పశ్చిమ దేశాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఎంతో పరిశుభ్రంగా ఉంటాయని, కానీ ఇక్కడ రోడ్లపైన చెత్త, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తుంటాయన్నారు. రోడ్లపైన, కాలువలలో చెత్త వేయకపోవడమే పారిశుధ్య కార్మికులకు మనం ఇచ్చే నిజమైన గౌరవమన్నారు. అలాగే భవన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడే వదిలేయకుండా నగర పాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశంలో పడవేయడం ద్వారా ఆ ప్రాంతంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచుకోవచ్చన్నారు. నగరంలో ఫౌంటైన్ల నిర్మాణం వెనుక కూడా ఒక కారణం ఉందని. ఈ ఫౌంటైన్లు వెదజల్లే నీటి వల్ల దుమ్మును తగ్గించడం ద్వారా రహదారులను డస్ట్ ఫ్రీగా ఉంచేందుకు దోహదపడతాయన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం లక్షల మంది భక్తులకు ఆతిథ్యం ఇవ్వనుందని, ఇటువంటి తరుణంలో స్వచ్ఛ రాజమహేంద్రవరాన్ని నిర్మించుకోవాల్సిన ఆవశ్యకత, బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా మనం కలలు కన్న రాజమహేంద్రవరాన్ని నిర్మించుకోగలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, అడిషినల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ శైలజా వల్లి, ఎంహెచ్‌ఓ వి.వినూత్న, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

వెన్నెముక వంకర్లకు విజయవంతంగా శస్త్రచికిత్స



వేద ఆసుపత్రిలో బాల ధరణికి ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

ప్రకాశం నగర్: పుట్టుకతో వెన్నెముకకు వంకర్లు వచ్చిన 12 ఏళ్ల బాల ధరణికి శనివారం వేద ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. నగరంలోని ఐటీడీఏ ప్రాంతానికి చెందిన బాల సింహాద్రి, అనితల కుమార్తె ధరణి 8వ తరగతి చదువుతోంది. పుట్టుకతోనే జన్యుపరంగా వెన్నుముక వంకర్లతో ఇబ్బందులు పడుతోంది. ఆమెకు వేద ఆసుపత్రిలోని వైద్యులు తేజో ఫణీంద్ర (వెన్నుముక నిపుణులు) సిండ్రోమిక్ సోలియోసిస్ న్యూరోఫైబ్రోసిస్ (వెన్నుపూస) వంకరకు సుమారు ఆరు గంటల పాటు ఆపరేషన్ చేసి వంకర్లను సరిచేశారు. ఈ శస్త్ర చికిత్సలో డాక్టర్ కిశోర్, డాక్టర్ ప్రదీప్‌తో పాటు మరో ఆరుగురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో ధరణి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్



స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శాటిలైట్‌సిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్‌సిటీ ఆఫ్ ఏపీ, సమగ్రశిక్షా, ముస్కాన్ సహకారంతో శనివారం స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. సైన్స్ సిటీ స్పేస్ ఎడ్యుకేషన్ సీఈవో కేశినేని వెంకటేశ్వరరావు, ముస్కాన్ సంస్థ నిర్వాహకుడు ప్రదేశ్ దేవనాథ్ నేతృత్వంలో పాఠశాల విద్యార్థులకు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. ఈ సాంకేతికతలు ప్రస్తుత కాలంలో ఎలా ఉపయోగపడుతున్నాయో వివరిస్తూ ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, డీఈవో వాసుదేవరావు, సమగ్రశిక్షా ఏపీడీ ఎస్.సుభాషిణి, జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ, హెచ్‌ఎం ప్రశాంతి పాల్గొన్నారు.

పిల్లలకు చదువుపై మక్కువ పెంచాలి



ప్రీ స్కూల్ కిట్లపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ బేబీరాణి



కొంతమూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: పిల్లలకు చిన్నతనం నుంచే చదువుపై మక్కువ పెంచేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ బేబీరాణి అన్నారు. స్థానిక 39వ వార్డులోని లింగంపేట–2, తుమ్మలావ–2 అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణితో పాటు అంగన్‌వాడీ టీచర్ మున్నీ చిన్నారుల తల్లిదండ్రులకు పలు అంశాలపై సూచనలు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు యాక్టివిటీల ద్వారా విద్యాబోధన చేస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్‌కే గుల్జార్ బేగం అన్నారు. కొంతమూరు శానిటోరియంలోని అంగన్‌వాడీ కేంద్రం–1, 2 లలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేటర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ మూడేళ్లు పూర్తయిన పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి ఈసీఈ డేపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం టి.ధనలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు ఆర్.బేబి, ఎన్.సుధారాణి పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపు

రాజానగరం: అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను శనివారం జాతీయ రహదారిపై జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలో స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పార్వతీపురం నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఆవులను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై నాగార్జున, సిబ్బందితో కలసి రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వారిని చూసి, వ్యాన్‌ను ఆపి డ్రైవర్ పరారయ్యే ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకుని విచారణ చేశారు. వ్యాన్‌లో తరలిస్తున్న 20 ఆవులను, 36 ఆవు దూడలను స్వాధీనం చేసుకుని, గోశాలకు తరలించారు.

యువకుడి అదృశ్యం

సీతానగరం: వంగలపూడికి చెందిన పల్లప్రోలు వెంకట దుర్గా ప్రసాద్ కనిపించడం లేదని, అతడి చిన్నాన్న శివ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు సీతానగరం డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్లు తీసుకోవాలని తెలిపి వెళ్లిన వెంకట దుర్గా ప్రసాద్ తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న విద్యార్థులు

కంబాలచెరువు: కార్గిల్ యుద్ధంలో మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా ఆర్ట్స్ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మట్లాడుతూ ప్రతి యువకుడిలో దేశభక్తి నిండి ఉండాలని, దేశం ముందు మిగతా అన్నీ తరువాతే అనే బాధ్యతతో ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామమూర్తి విద్యార్థుల్లో దేశప్రేమ, సైనికుల త్యాగాల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ నేపథ్యం, కారణాలు, పరిణామాలను విపులంగా వివరించారు.

1 నుంచి అర్బన్ ఆటో మ్యూటేషన్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ఇళ్లు, ఫ్లాట్లకు ఇకపై రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే యజమాని పేరుతో ఆస్తి బదలాయింపు (మ్యూటేషన్) ఆటోమేటిక్‌గా జరుగుతుందని డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ తెలిపారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని వార్డు సచివాలయ అడ్మిన్లకు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ ఆటో మ్యూటేషన్ విధానం అమల్లోకి రానుందన్నారు. దీని ద్వారా ఆస్తి లావాదేవీలలో వేగం, పారదర్శకత తీసుకురావడానికి వీలు కలుగుతుందన్నారు. సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఎసెస్‌మెంట్ నంబర్ కలిగి, ఆస్తి మొత్తంగా అమ్మకం జరిగిన ఇళ్లు, ఫ్లాట్లకు ఈ విధానం వర్తిస్తుందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కాగానే ఆ వివరాలు కార్పొరేషన్ ఈఆర్‌పీ ఆన్‌లైన్ విధానంతో అనుసంధానమై, పన్ను వివరాలు పరిశీలించి బకాయిలు ఉంటే చెల్లించిన పిదప ఆటో మ్యూటేషన్ సర్టిఫికెట్ జనరేట్ అవుతుందన్నారు. అలాగే అసలు ఇంటి పన్ను లేని ఇళ్లు రిజిస్ట్రేషన్‌కు వచ్చినపుడు వాటి వివరాలు ఆన్ లైన్ ద్వారా నగరపాలక సంస్థకు వస్తాయన్నారు. ఆ వివరాలతో పన్ను విధించిన తదుపరి మాత్రమే మ్యూటేషను జరిగి పేరు మార్పు ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. మార్కెట్ విలువ, విస్తీర్ణాన్ని బట్టి మ్యూటేషన్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ ఆస్తుల మార్పిడికి సంబంధించి పుర ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్ట్యా ఈ వినూత్న డిజిటల్ విధానాన్ని మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖలు సంయుక్తంగా అందుబాటులోకి తీసుకువచ్చాయన్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానం అమలు తీరు పరిశీలించిన తర్వాత ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా 17 నగరాలు, పట్టణాలకు విస్తరించేందుకు రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సిద్ధమైందన్నారు. ఖాళీ స్థలం కొనుగోలు చేసినప్పుడు కూడా ఇదే విధానంలో మ్యూటేషన్ జరుగుతుందన్నారు. అయితే యజమాని అప్పటికే వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లిస్తుండాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్లు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, ఆర్ఐలు, ఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం ప్రారంభం

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లి ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పనులను ఆర్ అండ్‌బీ జేఈ సత్యనారాయణ, ఉపసర్పంచ్ ముద్రగడ జెమి, ఎంపీటీసీ విత్తనాల సాయి, స్థానిక నాయకుల షేక్ సద్దా తదితరులతో కలసి పరిశీలించారు. గ్రామంలో ప్రధాన రహదారి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ రోడ్లను వినియోగించుకుని, పనులకు సహరించాల్సిందిగా ముద్రగడ జెమి కోరారు.